క్లుప్తంగా

శాకంబరిగా పోలేరమ్మతల్లి

అచ్చంపేట: మండలంలోని చామర్రులో గ్రామ దేవతగా భక్తులతో పూజలందుకుంటున్న పోలేరమ్మతల్లిని భక్తులు ఆదివారం శాకంబరిగా అలంకరించారు. పొంగళ్లు పొంగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిండు మనస్సుతో ప్రార్థిస్తే దీవెనలు



విజయపురిసౌత్: నిండు మనస్సుతో మరియతల్లిని ప్రార్థిస్తే భక్తులకు దీవెనలు అందుతాయని సాగర్‌మాత ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ అన్నారు. సాగర్‌మాత ఆలయంలో ఆదివారం ఉదయం జరిగిన దివ్యబలి పూజా కార్యక్రమంలో భక్తులనుద్దేశించి ప్రసంగించారు. సమాజంలో తోటి వారిని ప్రేమిస్తూ నీతివంతమైన జీవితం గడపాలని అన్నారు. దీనికి ముందు మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఓల్గా మాతృమూర్తి సుబ్బమ్మకు ఘన నివాళి



యద్దపాడు: ప్రముఖ స్త్రీవాద రచయిత్రి పోపూరి లలిత కుమారి (ఓల్గా) మాతృమూర్తి సుబ్బమ్మ సంస్మరణ సభ యద్దపాడు పీఆర్ కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రచయిత్రి ఓల్గా, అక్కినేని కుటుంబరావు, న్యాయవాది చెరుకూరి సత్యనారాయణ, నారాయణ స్కూలు ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన, పోపూరి ప్రసాద్, పోపూరి రవి మారుతి, ముత్తవరపు సురేష్‌బాబు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే గర్భిణుల ఆరోగ్య పరిరక్షణ



చిలకలూరిపేట: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని గైనకాలజిస్టు డాక్టర్ కందిమళ్ల తేజస్విని సూచించారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో మాతాశిశు ఆరోగ్యంపై పట్టణంలోని రోటరీ కమ్యునిటీ హాలులో ఆదివారం ఆరోగ్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని తెలిపారు. గర్భిణి ఆరోగ్యంపైనే పుట్టే బిడ్డ ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. క్రమం తప్పకుండా వైద్యుల్ని సంప్రదించడం, వారు సూచించిన మందులు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. దీంతో పాటు పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. పుట్టిన బిడ్డకు కూడా తల్లిపాలతో పాటు వైద్య పట్టికలో సూచించిన విధంగా టీకాలు, ఇతర మందులు అందజేయాలని తెలిపారు. అనంతరం ఐరన్, కాల్షియం బిళ్లలు, టానిక్‌లు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కాపు వెంకటరావు, కార్యదర్శి ఆళ్ల వేమన రెడ్డి, సభ్యులు మిన్నెకంటి కొండలరావు, తోటకూర వెంకటనారాయణ, కందిమళ్ల అంజిబాబు, తాళ్ల అంజిరెడ్డి పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడే జగద్గురువు



చిలకలూరిపేట: భగవద్గీతను బోధించిన శ్రీకృష్ణుడే జగద్గురువు అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు కటికం సైదారావు తెలిపారు. ఆషాఢ మాసం గురు పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని పురుషోత్తమపట్నంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుడే మనిషి రూపంలో జన్మిస్తే ఆయన్ను మాత్రమే గురువుగా భావించాలని త్రైత సిద్ధాంతం తెలుపుతోందన్నారు. ఆషాఢ మాసంలో చంద్రుడు గుండ్రంగా పెద్దగా ఉండటం వల్ల గురు పౌర్ణమిగా నిర్ణయించి, సాక్షాత్తు శ్రీకృష్ణుడిని జగద్గురువుగా భావించి గురు పూజ చేయాలని చెప్పారు. ఇంటింటికీ తిరిగి త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి ప్రచారం నిర్వహించారు. సమితి సభ్యులు కె. అరుణ, కె. కోటేశ్వరరావు, కె. నారాయణమ్మ, గోపి, వీరయ్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పేదలు వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



కంటి వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు, హనుమయ్య తదితరులు

అచ్చంపేట: కంటి వైద్య శిబిరాలు ఏర్పాటుతో పేదలకు సేవలందిస్తున్న జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు నూతలపాటి హనుమయ్య అభినందనీయులని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో ఆదివారం నూతనలపాటి హనుమయ్య ఆధ్వర్యంలో శంకర కంటి వైద్యశాల సహకారంతో ఉచిత కంటివైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సుమారు 1200 మందికి పరీక్షలు నిర్వహించి 500 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. నాడు- నేడు పథకం కింద నియోజకవర్గంలోని అన్ని పీహెచ్‌సీలకు నూతన భవనాలు నిర్మించి వైద్యులను నియమించినట్లు పేర్కొన్నారు. ఉచితంగా 60 రకాల వైద్యపరీక్షలు చేయిస్తున్నట్లు వివరించారు. గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా సేవా లక్ష్యంగా 25 ఏళ్ల పాటు ఉచిత నేత్ర శిబిరాలు ఏర్పాటు చేసి, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయడం కూడా తన బాధ్యతగా మెలుగుతున్న హనుమయ్య సేవలను కొనియాడారు. నిర్వాహకుడు నూతనపాటి హనుమయ్య మాట్లాడుతూ ఇప్పటి వరకు సుమారు 20వేల మందికి పైగా ఆపరేషన్లు చేయించి, వారికి కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంటిముందుకు వచ్చి బస్సులో ఎక్కించుకుని పెదకాకానిలో ఉన్న శంకర కంటి వైద్యశాలలో ఆపరేషన్లు చేయించి, మందులు, కళ్లజోళ్లు ఇవ్వడమే కాకుండా మూడు రోజులపాటు భోజన వసతులు కల్పించి, తిరిగి బస్సులో ఇంటికి చేరుస్తు నిరుపేదలకు సేవచేస్తూ తృప్తి పడుతున్నానని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణా నాయక్, సర్పంచి కంబాల వీరబాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, లీడ్‌క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, వైస్ ఎంపీపీ గంగసాని బాబు, మాజీ సర్పంచి టీపీఎస్ మల్లికార్జున రావు, సొసైటీ అధ్యక్షులు రామిశెట్టి రంగయ్య పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమం అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- దొడ్లేరులో గడప గడపకు మన ప్రభుత్వం



దొడ్లేరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

దొడ్లేరు(క్రోసూరు): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. ఆదివారం మండలంలోని దొడ్లేరు గ్రామంలోని సచివాలయం -1 పరిధిలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెబుతున్న గ్రామ స్వరాజ్యానికి దొడ్లేరు గ్రామం అసలైన ఉదాహరణ అని పేర్కొన్నారు. దొడ్లేరు గ్రామానికి అభివృద్ధికి రూ.21 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దొడ్లేరులో డబుల్ రోడ్డు వేస్తున్నామని చెప్పారు. డబుల్ రోడ్డు 33 అడుగుల వెడల్పుతో వేస్తూ డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు 400 మందికి జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలిచ్చామని తెలిపారు. మంచి చేయాలన్న సంకల్పం ఉంటే గ్రామస్వరాజ్యం సాధ్యమన్నారు. అవినీతి లేని పాలన జగనన్నతోనే సాధ్యమన్నారు. కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించామని వివరించారు. నాలుగేళ్ల పాలనలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చటం జరిగిందన్నారు. తాము మంచి చేశామనుకుంటేనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, నన్నూ తిరిగి ఆశీర్వదించాలని ధైర్యంగా అడుగుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు పల్లప్రోలు వెంకటేశ్వరరెడ్డి, గ్రామసర్పంచి ముక్కు అంజలి, సయ్యద్ అబ్దుల్‌రహీం, ఆవుల అంకిరెడ్డి, మర్రి శ్రీనివాసరెడ్డి, ఖాజా, గార్లపాటి దాసు, వెలది అప్పారావు, ఎంపీపీ కోటయ్య, జెడ్పీటీసీ సభ్యుడు జమీలాగఫూర్ పాల్గొన్నారు.

ఘనంగా ఆషాఢ మాస మాసశివరాత్రి వేడుకలు



అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరాలయంలో శాకంబరి దేవి అలంకారంలో అమ్మవారు

నకరికల్లు: ఆషాఢ మాసం పురస్కరించుకొని మాస శివరాత్రి వేడుకలను నర్సింగపాడులోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరాలయం, మరకతలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. మాసశివరాత్రి సందర్భంగా ఆయా ఆలయాల ప్రధాన అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్‌శర్మ, పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామివార్లను విశేషంగా అలంకరించారు. కాశీవిశ్వేశ్వరాలయంలో అన్నపూర్ణాదేవి అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరీదేవి రూపం ప్రత్యేకంగా అలంకరించారు. ఆయా ఆలయాల్లో విశేష అలంకరణలో ఉన్న అమ్మవారిని, స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం కాశీవిశ్వేశ్వరాలయంలో రాహు- కేతు పూజలు చేసేందుకు భక్తులు పలుగ్రామాల నుంచి తరలివచ్చారు. దోష నివారణకు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు.

నేడు జగనన్న సురక్ష శిబిరం

సత్తెనపల్లి(ముప్పాళ్ల): పట్టణంలోని 11,12 వార్డుల పరిధిలో వెంగళరెడ్డినగర్‌లోని 14వ సచివాలయం వద్ద జగనన్న సురక్ష క్యాంపు సోమవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ ఆదివారం తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారన్నారు.

రేపు మాదలలో జగనన్న సురక్ష శిబిరం

ముప్పాళ్ల: మండలంలోని మాదల గ్రామంలో ఈ నెల 18న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.భవానీశంకర్ ఆదివారం తెలిపారు. క్యాంపులో 11 రకాలకు చెందిన ధ్రువీకరణపత్రాలు అందించటం జరుగుతుందని చెప్పారు.

ట్రాక్టర్ అదుపు తప్పి ముగ్గురికి గాయాలు

క్రోసూరు: క్రోసూరు నుంచి అందుకూరు గ్రామ పొలాల్లో కలుపులు తీసేందుకు కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ ఆదివారం అదుపుతప్పింది. దీంతో ఒక్కసారిగా కూలీలు ఒకరిపై ఒకరు పడగా వారిలో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. అందరూ ప్రాథమిక చికిత్స పొందారు.

చెట్లు నరికివేతపై తూతూ మంత్రంగా ఫిర్యాదు



రొంపిచర్ల: మొక్కలు పెంచండి.. పర్యావరణాన్ని కాపాడండి అనే నినాదం మాటలకే పరిమితం అవుతోంది. పర్యావరణాన్ని కాపాడేందుకు చెట్ల పెంపకం ఒక్కటే ప్రధాన మార్గమని ప్రతి ఒక్కరికీ తెలుసు. మొక్కలు పెంచేందుకు ప్రభుత్వం నుంచి స్వచ్ఛంద సంస్థలు సహా పలు కార్యక్రమాలు చేపడుతున్నాయి. అయితే, కొందరు స్వార్థపరులు, అక్రమార్కులు ప్రభుత్వ ఆధీనంలోని చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని విప్పర్లపల్లి, మునమాక గ్రామాల మధ్య ఆర్ అండ్ బీ రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన చెట్లపై అక్రమార్కుల కన్నుపడింది. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం మిషనరీతో చెట్లను ముక్కలుగా చేసి ట్రాక్టర్లపై తరలించారు. సమాచారం తెలుసుకున్న సచివాలయం సిబ్బంది అక్కడకు వెళ్లి ప్రశ్నించగా ఆర్ అండ్ బీ అధికారులు అనుమతి ఇచ్చారని చెప్పారు. అనుమతి పత్రాలు చూపించమనడంతో వాదనకు దిగారు. ఇదే సమయంలో ఆర్ అండ్ బీ అధికారులకు సచివాలయం అధికారులు సమాచారం అందజేశారు. ఆ శాఖకు చెందిన ఏఈ ఆ ప్రాంతానికి చేరుకొని చెట్ల నరికివేతను నిలుపుదల చేశారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. నరికిన కలపను ట్రాక్టర్లలో తరలించి వేశారు. అయితే, ఆ అధికారి కూడా తీరిగ్గా ఆదివారం రొంపిచర్ల పోలీసులకు గుర్తు తెలియని వ్యక్తులు చెట్లను నరికారని ఫిర్యాదు చేశారు. ఆర్ అండ్ బీ నిర్లక్ష్యంతోనే పచ్చని చెట్లు నరికారంటూ గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెద్దింటమ్మతల్లికి ఆషాఢ మాస బోనాలు



పెద్దింటమ్మతల్లికి సమర్పించటానికి ఊరేగింపుగా బోనాలు తీసుకు వెళుతున్న భక్తులు

అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరావతి గ్రామ దేవత పెద్దింటమ్మ తల్లి ఆషాఢ మాసం బోనాలు ఆదివారం సమర్పించారు. ఉదయాన్నే పెద్దింటమ్మ అమ్మవారికి పంచామృత అభిషేకం, అనంతరం విశేషాలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. గ్రామంలోని భక్తులు పొంగళ్లు చేసుకుని అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు స్థానిక మహాలక్ష్మమ్మ చెట్టువద్ద నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా పెద్దింటమ్మ గుడికి చేరుకుని అమ్మవారికి ఆషాఢ మాస బోనాలు సమర్పించారు.

శాకంబరి అలంకరణలో అమ్మవారు దర్శనం



కుందురువారిపాలెం గ్రామంలో శాకంబరిగా అమ్మవారు

కుందురువారిపాలెం(ముప్పాళ్ల): గ్రామంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని శాకంబరిగా ఆదివారం అలంకరించారు. సత్తెనపల్లికి చెందిన గాయత్రి పరివార్ కుటుంబ సభ్యులు పాల్గొని కూరగాయలతో అమ్మవారిని అలంకరించి ఆషాఢ మాసం సారె సమర్పించారు. అనంతరం ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిలకల సాంబశివరావు, హరిప్రసాద్, కందకట్ల సుబ్బరామయ్య పాల్గొన్నారు.

నగరేశ్వరుని జలాధివాసం



బొడ్రాయి వద్ద జలబిందెలతో మహిళలు

కారెంపూడి: గ్రామం సుభిక్షంగా ఉండాలని వర్షాలు పుష్కలంగా పడి పంటలు పండాలని ఆకాంక్షిస్తూ ఆర్యవైశ్య సంఘం మహిళలు గ్రామంలో బొడ్రాయికి, నగరేశ్వరస్వామికి ఆదివారం జలాభిషేకం చేశారు. మహిళలు భారీ సంఖ్యలో బిందెలతో నీటిని తీసుకుని అంకాలమ్మ గుడి సెంటర్‌లో ఉన్న బొడ్రాయికి జలాభిషేకం చేశారు. అనంతరం నగరేశ్వరస్వామి మూల విరాట్‌కు సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. రోజంతా స్వామి వారు జలాధివాసం చేసేవిధంగా అభిషేకించిన నీటిలో ఉంచారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మిత్తింటి సాంబశివరావు ఆర్యవైశ్య సంఘ పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు చౌడేశ్వరి మాత జన్మదిన వేడుకలు

రెంటచింతల: స్థానిక బాలవికాస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ సమీపంలో వేంచేసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం చౌడేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పెద్ద శెట్టి పల్లా వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఆషాఢమాస అమావాస్య సందర్భంగా అమ్మవారి వేడుకల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుల నేతృత్వంలో వేకువజాము నుంచే అమ్మవారికి ఉదయం 5గం.లకు సుప్రభాత సేవ, వేదపారాయణం, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకాలు, నవగ్రహ మండపారాధన, ఉదయం 10గం.లకు సహస్రకుంకుమార్చన, మంత్ర పుష్పం జరిపించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చౌడేశ్వరీ అమ్మవారి జన్మదిన వేడుకల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.

పచ్చిరొట్ట పైర్లతో బహుళ ప్రయోజనాలు



గోళ్లపాడులో పచ్చిరొట్ట సాగు చేస్తున్న పొలం

ముప్పాళ్ల: పచ్చిరొట్ట పైర్లతో రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ పేర్కొన్నారు. పెరిగిన ఎరువుల ధరలతో సాగు భారంగా మారిన తరుణంలో పచ్చిరొట్ట పైరు సాగుకు ఎంతో ఉపయోగకారిగా ఉంటుందని చెప్పారు. తప్పనిసరిగా పచ్చిరొట్ట పైర్లయిన జనుము, జీలుగ, పిల్లిపెసరలతో పాటుగా పెసరను పచ్చిరొట్టగా సాగు చేసుకోవచ్చన్నారు. మండలంలో అధికంగా మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతుండటం, సాగు చేసే సమయం కూడా అధికంగా ఉండటంతో ముందస్తుగా పచ్చిరొట్ట పంట వేసుకున్నట్లయితే కొంత మేర పెట్టుబడి తగ్గించుకోవచ్చని సూచించారు. మొక్కజొన్న సాగులో అధికంగా యూరియా వాడుతుండటంతో భూసారం దెబ్బతినే అవకాశం ఉందని, పచ్చిరొట్ట సాగు వలన భూసారం పెంచుకోవచ్చన్నారు. తొలకరి వర్షాలు పడిన తర్వాత ఎకరానికి 15 నుంచి 20 కేజీల పచ్చిరొట్ట విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. 50 నుంచి 55 రోజుల తర్వాత పంట పూత దశకు రాకముందు భూమిలో కలియదున్నుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ విధంగా చేయడం వలన ఎకరాకు 25 నుంచి 30టన్నుల పచ్చిరొట్ట ఎరువు ఉత్పత్తవుతుందని తెలిపారు. భూమిలో కలియదున్నితే నత్రజని, సేంద్రియ పదార్థం భూమిలో ఇముడుతాయని, రసాయన ఎరువుల వాడకం గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. నేలలో సేంద్రియ పదార్థం ఉండటం వల్ల సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని, నేల సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకొని ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచుకుంటుందని వివరించారు. నేల వదులుగా ఉండటంతో గాలి లోపల పొరల్లోకి ప్రవేశిస్తుందని, దీని వలన సాగు చేసిన పంట వేర్లు ఏపుగా పెరిగి తద్వారా అధిక దిగుబడి పొందవచ్చని తెలిపారు.

యూసీసీతో అన్ని వర్గాలకు నష్టం



మాట్లాడుతున్న నవజ్యోతి

నకరికల్లు: బీజేపీ ప్రభుత్వం అమలు చేయనున్న యూసీసీ వల్ల అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని భారత్ బచావో రాష్ట్ర కమిటీ నాయకులు కోలా నవజ్యోతి అన్నారు. స్థానిక భగత్‌సింగ్ భవన్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో యూసీసీని నిరసిస్తూ ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పౌరస్మృతి వలన దేశంలో గిరిజనులు, ఆదివాసీలు, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆచార సంప్రదాయాలకు భంగం వాటిల్లుతుందని అన్నారు. పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు కులమతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. దేశంలోని అన్నివర్గాల ప్రజలు యూసీసీని వ్యతిరేకిస్తున్నారని అన్నారు. సమావేశానికి పీడీఎం జిల్లా సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.కోటానాయక్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్ సైదా, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ హుసేన్, నాయకులు సలీల్, నాదాల జాను, గోదా బాల, జిలాని, ముజావర్ జాన్‌అహ్మద్, మడకా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ జలకళ రైతులకు ప్రయోజనకరం

- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే)
- చింతలతండాలో జలకళ కింద బోరు ప్రారంభం



చింతలతండా గ్రామంలో బోరును ప్రారంభించి మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

విజయపురిసౌత్: సాగునీటికి ఇబ్బంది పడుతున్న రైతాంగానికి వైఎస్సార్ జలకళ ఎంతో ప్రయోజనకరమని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మాచర్ల మండలంలోని చింతలతండా గ్రామంలో వైఎస్సార్ జలకళ పథకం ద్వారా బోరును ప్రారంభించి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ జలకళ ద్వారా రాష్ట్రంలో సాగునీటికి ఇబ్బంది పడుతున్న ప్రతి రైతుకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. రైతు పక్షపాతి అయిన జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ప్రవేశపెట్టిన పలు పథకాలతోపాటు వైఎస్సార్ జలకళ సన్న, చిన్నకారు రైతులకు ఒక వరమన్నారు. జలకళ ద్వారా 2.5 నుంచి 5 ఎకరాలలోపు రైతులకు ఉచితంగా బోరు వేసి, మోటారు, విద్యుత్ కనెక్షన్ అందించి అన్నదాతలను ఆదుకుంటున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌దే అన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ పీఆర్కేను గ్రామ సర్పంచ్ కేతావత్ శ్రీనునాయక్ సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి, ఎంపీపీ బూడిద శ్రీను, మాచర్ల మండల జేసీఎస్ కన్వీనర్ శేరెడ్డి వీరారెడ్డి, ఎంపీటీసీ కేతావత్ బుజ్జి సీతానాయక్, వైస్ సర్పంచ్ లచ్చూనాయక్, మాజీ ఎంపీటీసీ కేతావత్ జ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతావత్ హనుమానాయక్, కె శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కారెంపూడి: మండలంలోని కారెంపూడి గ్రామ రైతు రమావతు తేజానాయక్ పొలంలో వైఎస్సార్ జలకళ పథకం కింద ఆదివారం ప్రభుత్వం ఉచితంగా బోరు వేయించింది. బోరు తవ్వకం పనులు రైతుల కోలాహలం మధ్య ప్రారంభమయ్యాయి. బోరు తవ్వకం పనులను జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, సర్పంచ్ ప్రమీలాభాయి, జెడ్పీటీసీ సభ్యుడు షేక్ షఫీ, మండల యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, ఎంపీటీసీలు ఏసోబు, లింగయ్య, ట్రస్టు బోర్డు చైర్మన్ చల్లా ప్రసాద్, పాతూరి రామిరెడ్డి, పొట్టుమూర్తి లింగం, జక్కా నరసింహారావు తదితరులు ప్రారంభించారు. చింతపల్లి గ్రామంలో రైతు బొట్లగుంట క్రిష్ణ పొలంలో కూడా జలకళ పథకం కింద ఆదివారం బోరు వేశారు. ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు గాడిపర్తి పూర్ణయ్య, బొట్లగుంట రామారావు, ఆశం భాస్కరరెడ్డి, మర్రి శేషయ్య, సూరె వెంకటేశ్వర్లు, పలిశెట్టి ఆంజనేయులు బోరు తవ్వకం పనులను ప్రారంభించారు.

విద్యార్థులకు చెస్ పోటీలు



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న కిషోర్

మాచర్ల: చెస్ పోటీల వల్ల మేధాశక్తి పెరుగుతుందని చెస్ కోచ్ కిరణ్ పేర్కొన్నారు. ప్రపంచ చెస్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కోదండ రామాలయంలో ఆదివారం చెస్ పోటీలను మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్ చేతుల మీదుగా ప్రారంభించి నిర్వహించినట్లు వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు అన్నారు. అతిథిగా వైఎస్సార్ సీపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఉప్పలపాటి జాని విచ్చేశారు. ఈ పోటీల్లో 50 మంది పాల్గొన్నారన్నారు. పాల్గొన్న వారికి జామెంట్రీ బాక్సులను దాత సెక్రెటరీ పందిరి నరసింహారావు అందజేశారు. వారు మాట్లాడుతూ చెస్ ఆట మేధాశక్తిని పెంపొందిస్తుందన్నారు. ప్రతి ఒక్క తల్లిదండ్రులు చిన్నారులకు చెస్ పోటీని అలవర్చుకునేలా తమ చిన్నారులను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, జోన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, వనితా లక్ష్మీ అధ్యక్షురాలు మేడా వెంకటలక్ష్మి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు కొత్తమాసు బ్రహ్మారావు, జాయింట్ సెక్రెటరీ బచ్చు రాజ్‌కుమార్, అన్నపూర్ణేశ్వరి ఆలయ సభ్యులు పందిరి బాల గురవయ్య, గంగిశెట్టి రాధాకృష్ణ, సామ్రాజ్యం పాల్గొన్నారు.

అవోపా సామాజిక సేవలు ఆదర్శనీయం

గుంటూరు ఎడ్యుకేషన్: పేద వర్గాలకు అవోపా అందిస్తున్న సామాజిక సేవలు ఆదర్శనీయమని గుంటూరు స్పిన్నింగ్ మిల్ మేనేజింగ్ ఎం.వి. సత్యనారాయణ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్-ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) కార్యాలయంలో ఆదివారం పేదలకు నెలవారీ పెన్షన్ల పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి నెలా 102 మందికి రూ.400 చొప్పున పెన్షన్లు పంపిణీ చేయడం అభినందనీయమని తెలిపారు. వృద్ధులు, అనాథలకు చేసే సేవ భగవంతునికి చేసినట్లేనని పేర్కొన్నారు. అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు మాట్లాడుతూ ఆగస్టులో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు రూ.10 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అనంతరం డాక్టర్ రామలింగేశ్వరరావు వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా గుంటూరు శాఖ అధ్యక్షుడు కె.వి. బ్రహ్మం, కార్యదర్శి వి. రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, సభ్యులు వెంకట్రావు, ఊటుకూరి నాగేశ్వరరావు, కంచర్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.